
కథ

# జీవఫలం

దాసరి అమరేంద్ర



## జీవితమంటే?

ఈ ప్రశ్నకు సమాధానం వుందా? అర్థం వుందా? జీవితమంటే జీవించడమే కదూ? సంతృప్తిగా సాగపోవడమే  కదూ?

పుట్టడం, పెరగడం, చదువు, ఉద్యోగం, ప్రమోషన్లు, ఆశానిరాశలు, జయాపజయాలు, నిప్పులు కక్కుతూ  నింగికి ఎగిసే యత్నాలు, రక్తం కక్కుతూ నేలకు రాలే వైఫల్యాలు, డబ్బు, కీర్తి; అధికారం, పిల్లలు, కుటుంబం, ఆధునిక సదుపాయాలు, సుఖజీవనం...ఇదే కదూ! అందరరూ ఆశించి అర్రులు జాచే పద్ధతీ?  కాలపరీక్షకు నిలిచిన పద్ధతీ?

కానీ ఇక్కడ సంతృప్తి అన్నమాట కనిపించడం లేదే?  పైవన్నీ లభిస్తే సంతృప్తి దానంతట అదే సిద్ధిస్తుందా? అసలు  డబ్బూ, కీర్తీ, పదవీ లాంటివి సంతృప్తికి విలోమం కాదూ?

అప్పటిదాకా గుడివాడ స్టేషన్లో నిలిచి వున్న సర్కారు ఎక్స్‌ప్రెస్ ఘీంకరించి కొండ చిలువలా భారంగా కదలసాగింది. ఆ ప్లాట్‌ఫాం మీద కనిపించి నా దృష్టిని ఆకట్టుకున్న లంబాడీ కుటుంబపు దృశ్యం మెల్లగా కనుమరుగయింది. వాళ్ళు సంతృప్తిగా లేరూ? వెలుగు రేకలు విచ్చుకుంటోన్న ఆ అమృత ఘడియల్లో ఓ గానుగ చెట్టు కింద మూడు  రాళ్ల పొయ్యి మీద వున్న జొన్న రొట్టెలు కాలుస్తోన్న ఆ లంబాడీ యువతీ, పక్క వదలకుండానే వేడి, వేడి  రొట్టెలు తింటోన్న ఆ తండ్రీ పిల్లలూ, వాళ్ళ నవ్వులూ, కేరింతలూ– వాళ్ళు సంతోషంగా లేరూ? సంతృప్తిగా లేరూ?

ఈ రకంగా జీవితాలను రొమాంటిసైజ్ చేయడం సమంజసమేనా?

ఏమో! లోతుల్లోకి దిగకుండా చూస్తే వాళ్ళే నాకన్నా సంతృప్తిగా వున్నారనిపిస్తోంది.

పది,పదిహేనేళ్ళు  దాటిపోయాయి. పొట్టపట్టుకుని అమెరికా వెళ్ళి. మొదటిలో ఇష్టం వుండేది కాదు. తప్పలేదు. క్వాలిఫికేషన్లకు సరిపడే ఉద్యోగం దొరకడం లేదన్న దుగ్ధ.  కుంటినడక వ్యవస్థలో–ప్రతిభకు గోరీలు కట్టే చోట– ఎందుకు వుండిపోవాలన్న ఆలోచన. చీకటిని తిట్టుకోవడం కన్నా చిరుదివ్వెను వెలిగించండం మిన్న అన్న విజ్ఞతను  అణచిపెట్టి విదేశీ ప్రవాసం.

నిజమే! అక్కడి వ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. అవినీతికి చోటులేదు. బతుకు భయం లేదు.

ఉద్యోగాలకు లోటు లేదు. మానవుడే మహనీయుడక్కడ. సుఖజీవితం సులభసాధ్యం. అయినా నాకెందుకో సంతృప్తిగా వుండడం లేదు. ఎవ్వరో మహమ్మద్ రఫీ బొంబాయిని గురించి పాడలేదూ! 'అక్కడ సమస్తమూ దొరుకుతాయి గానీ హృదయమే కరువు' అనీ.

ఆమాట న్యూయార్క్‌కి పదిరెట్లు ఎక్కువగా వర్తిస్తుంది. ఎంతయినా వున్న వూరు వూరే! పదిహేనేళ్ళు బట్టీ చూస్తోన్నా ఆ న్యూయార్క్లూ, న్యూజెర్సీ, వాషింగ్టన్ డి.సి.. ఇంకా పరాయి వూళ్ళే అనిపిస్తాయి. అసలెప్పుడూ వెళ్ళకపోయినా శ్రీకాకుళాలూ, కర్నూళ్ళూ, పోచంపల్లిలే ఆత్మీయంగా అన్పిస్తాయి. ఎంతయినా వున్న వూరూ, కన్న దేశం- వాటి మహిమ మరి!

కానీ అదేం మాటా? ఎక్కడ మనం వుంటే అదే వున్న వూరు కాదూ? తనలోనూ, తన పరిసరాలలోనూ మనిషి లీనమవ్వగలగాలి. అప్పుడే కదా ప్రశాంతీ, సంతృప్తీ!

కానీ మన జీవిత లక్ష్యం ఏ గాలిలో ఏ నింగిన ఎదిగినా ఏ గగనాన పుష్పించి ఫలించినా దాని తల్లివేరు మాత్రం కన్న దేశపు నేలలో బలంగా పాతుకుపోయి వుండడం సహజం. మన ఊహలూ, జ్ఞాపకాలూ, సెంటిమెంట్లూ చిన్నప్పుడు మనం ఆడీ పాడిన వూరితో బలంగా ముడిపడి వుంటాయి. మన మూలాల లోతులను గ్రహించి వాటిని మన జీవ ఫలాలతో మిళితం చేయగలిగితేనే సంతృప్తి. కన్నదేశపు మమతను గుండెల్లో నింపుకొని పెంచి పోషించిన దేశాన్ని కూడా ప్రేమించగల శక్తిని సమకూర్చుకున్నప్పుడే సంతోష ప్రాప్తి. విశ్వప్రేమ.

తన అమెరికా జీవితం కూడా వడ్డించిన విస్తరిలా ఆరంభమవ్వలేదు. తనకున్న ఎం.కాం. డిగ్రీతో ఓ మారుమూల యూనివర్శిటీలో ఎం.బి.ఏ.లో సీటు సంపాదించడం. అక్కడికి వెళ్ళడానికి మొదటి మూడునెలలు తనను తాను పోషించుకోవడానికి ఎంత ఖర్చూ..ఎంత శ్రమా! పైగా విపరీతమైన ఎకడమిక్ వర్క్. దానికితోడు ఉదయాలు పేపరు పంచడం. సాయంత్రాలు రెస్టారెంట్లో పని. శనీ, ఆది వారాలు పెట్రోల్ బంకులో. రోజుకు పద్దెనిమిది గంటలు. వారానికి ఏడు రోజులు-శ్రమే శ్రమ. పైపెచ్చు అర్థం అయ్యీ కాని ఇంగ్లీషు యాసలో పాఠాలు. పరిచయం లేని సంస్కృతి. అది స్వేచ్ఛా విశృంఖలత్వమా? ఆ శారీరక మానసిక వత్తిడులకు నిలదొక్కుకోలేక వెనక్కి వెళ్ళిపోదాం అన్పించేది. ఎక్కడికి వెళ్ళడం? వెళ్ళి ఏం చేయడం? జీవన్మరణాలు ఆ అమెరికా కురుక్షేత్రంలోనే తేల్చుకోవాలన్పించింది. అయినా అంట్లు కడగడమంటే ప్రాణం విలవిలలాడేది. దానికన్నా కాకినాడలో కిళ్ళీకొట్టు పెట్టుకోవడం గౌరవప్రదంగా అనిపించేది. రీగన్ గారి అమ్మాయే అంట్లు కడగ్గా లేనిది నేనెంత? నా అహం ఎంత? టీనేజి పిల్లలు కూడా పార్ట్‌టైం ఉద్యోగాలు చేసి ఆర్థికంగా తమ కాళ్ళమీద తామే నిలబడడం గమనించాను. తమ జీవితాలను తామే నిర్దేశించుకోవడం గమనించాను. మనకూ, వీళ్ళకూ ఈ విషయంలో ఎంత తేడా! ఎంత వయసు వచ్చినా తల్లిదండ్రుల మీదా, అత్తామామల మీదా ఆధారపడే మనస్తత్వం మనది. ఆ సంస్కృతిలోని విలక్షణ లక్షణాలు మెల్లిగా బోధపడ్డాయి నాకు.



అమెరికాలో మెల్లిగా నిలదొక్కుకున్నాను. ఏం.బి.ఏ. అయిపోయింది. అయినా ఏదో చిన్న ఉద్యోగమే దొరికింది. అక్కౌంట్లు రాసే పని. మేనేజిమెంటు డిగ్రీని నిచ్చెనగా వాడి పైకెక్కేలోగానే అప్పట్లో విజృంభణ ఆరంభమైన కంప్యూటర్లు నన్ను ఆకర్షించాయి. ఆ రంగంలో అడుగుపెట్టాను. అలాంటి జవ జీవాలున్న రంగంలో అడ్డేముంది? నింగే నీకు హద్దు.

ఆర్థికంగా, వృత్తిపరంగా స్థిరపడ్డాను. ఉద్యోగాలు వెదుక్కొనే స్థితి దాటి ఉద్యోగాలే నన్ను వెదికే స్థాయికి చేరాను. రాత్రీ పగలూ అన్న తేడా లేకుండా పనే పరమావధిగా భావించి ఆరాధించాను. మిన్ను విరిగి మేని మీద పడ్డా సాయంకాలాల్లోనూ, శనీ, ఆదివారాల్లోనూ పని చేయడానికి ఏమాత్రం ఇష్టపడని అమెరికన్లతో పోలిస్తే అలాంటి పట్టింపులు ఏమాత్రం లేని నా ధోరణే నా విజయ పరంపరకు ఆధారభూతమయింది. అవసరాన్ని మించిన సంపాదన.

అయినా ఏదో అపరాధ భావన. నాలాంటి నియోరిచ్ వర్గం వాళ్ళం మా పరిసరాల నుంచీ, సమాజం నుంచీ ఆబగా అందిపుచ్చుకోవడమే తప్ప మా తరపు నుంచి ఈ ప్రపంచానికి ఏమీ ఇవ్వడం లేదన్న అసంతృప్తి. అసలీ ఇచ్చిపుచ్చుకోవడాలలోని అసమానతే కదూ పెరిగి పెద్దదై వర్గ వైరుధ్యాలకు నాంది పలుకుతున్నదీ? తెలివీ, శక్తీ వున్నవాళ్ళు మిగతా వాళ్ళ తలల మీదుగా నడిచి పైకి వెళ్ళిపోతున్నారు. ఆ మిగతా వాళ్ళు ఇంకా ఇంకా క్రిందికి దిగిపోతున్నారు. అందుకే కాదూ! కమ్యూనిస్టు పరిభాషలో 'ధనవంతులంతా దోపిడీ దొంగలు' అని సూత్రీకరించడం! మాట్లాడితే ప్రతిభ అంటారు. నిజమే! కానీ ప్రతిభ సాయంతో సమాజపు గాదె లోంచి మన అవసరాలకు మించి చిక్కించుకోవడం అనాగరికం కాదూ! ప్రతిభ వున్న పదిమందీ అది లేని తొంభై మందిని అణగదొక్కడం ఆటవికం కాదూ! అశక్తులూ, అమాయకులూ సగౌరవంగా జీవించే పరిస్థితి కల్పించలేని మన నాగరికత ఎందుకూ? తగలెట్టనా? అవును. ఇది ఆటవికమే. కనీసం నాలాంటి వాళ్లయినా ఇహ పుచ్చుకోవడం మానేసి ఇవ్వడం మొదలెట్టాలి.

నవ్వొచ్చింది. ఒకే ఒక్క చైతన్య స్రవంతిలో అటు మార్క్స్ గారి తత్వాన్ని, ఇటు గాంధీ గారి ట్రస్టీషిప్ సిద్ధాంతాన్ని కలగలుపుతున్నానన్నమాట!

'అంకుల్! ఇక్కడ కూర్చోవచ్చా!" ఆలోచనలు తెగాయి. తల ఎత్తి చూశాను. పద్దెనిమిదీ, పంతొమ్మిదీ వుంటాయి. పసి మొహం. ఎక్కడో, ఏదో ఓ విషాద వీచిక. జరిగి చోటు ఇచ్చాను.

భీమవరం దాటాం. తెల్లగా తెల్లారిపోయింది. బండి కాస్త లేటనుకుంటాను. మా జనరల్ కంపార్ట్‌మెంట్లో మరీ అంత తొక్కిడిగా ఏం లేదు. నాకు సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం అంటే ఇష్టం. కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి అన్ని వూళ్ళనూ పలకరిస్తూ వెడుతుంది. ఆయా వూళ్ళ అందాలనూ, ఆయా మడికారాల సొంపులనూ రుచి చూపిస్తుంది. మనుషులకు దగ్గరగా వుండొచ్చని నేను రెండో తరగతి ప్రయాణమే ఇష్టపడతాను. మా పిల్లలకు మాత్రం సెకెండ్ క్లాస్ సంగతి దేవుడెరుగు! అసలు రైళ్ళూ, బస్సులంటేనే పడదు. వాళ్ళదంతా కార్లూ, విమానాల వ్యవహారం. ఏకంగా పైతరగతిలో పుట్టారు కదా! అంచేత రైలు ప్రయాణాలు చేయలేని వాళ్ళ అశక్తత నాకు బెంగ

### పూజాబాత్రా సణుగుళ్ళు

*'ఆడలేక మద్దెలు ఓడు' అన్న సామెత లాగా హిందీ 'విరాసత్' తర్వాత తెలుగులో ఓ సినిమా చేసిన పూజాబాత్రా తన దురదృష్టాన్ని ఇలా వివరించింది. కుటుంబం అంతా సినిమా వాళ్ళే కాబట్టి కాజోల్, ప్రపంచ సుందరి, విశ్వ సుందరి టాగ్‌లతో ఐశ్వర్యా రాయ్, సుస్మితా సేన్‌లకి మిగిలిన వాళ్ళందరూ పోటీ తక్కువగా వున్న సమయంలో వచ్చారు కాబట్టి వాళ్ళకలా అవకాశాలొచ్చాయని సణుగుతోంది పొడుగు కాళ్ళ పూజ.*





### సన్నీడియోల్ పాట్లు

చాలా మంది నటీనటులు సంపాదించిన డబ్బు ఏం చేయాలో తెలీకో, లేకపోతే ఇంకా సంపాదించాలనో సొంతంగా సినిమాలు తీసి చేతులు కాల్చుకుంటూ వుంటారు. అలాగే సన్నీ సొంతంగా 'లండన్' అనే సినిమా కోసం ఎక్కడ పడితే అక్కడ అప్పలు చేసి ఇప్పుడు అవి తీర్చడం కోసం 'ఇస్కే టోపీ ఉస్కే సర్', 'జుల్మ్' వగైరా సినిమాల్లో స్పెషల్ అప్పియరెన్స్‌లు కూడా చేస్తున్నాడు.

పుట్టిస్తూ వుంటుంది.

'రారా కృష్ణయ్యా.. రారా కృష్ణయా' హటాత్తుగా విప్పారిన ఓ చక్కని గొంతు. ఎవరో ముసలాయన. మనవడు కాబోలు ఆసరా! వేసేవాళ్ళు ఒకటీ రెండు వేస్తున్నారు. మరికాసిని పాత పాటలు పాడించుకోవాలనిపించింది. ఆపాను...పాడాడు... సాదరంగా పంపేశాను.

దృష్టి పక్క కుర్రాడి మీదకు మళ్ళింది. మాట్లాడాలనిపించింది.

'ఎక్కడిదాకా బాబూ!' చెప్పాడు. మాటల్లో పడ్డాం. కదపగా, కదపగా తన విషయాలు చెప్ప కొచ్చాడు. "చాలా కష్టమవుతోంది. చదువెలా సాగించాలో అర్థం కావడం లేదు. పోనీ వున్న ఊళ్ళో చదువైతే అదో దారి. ఇంజనీరింగు గదా! హాస్టలూ, ఫీజులూ...నెలకు కనీసం వేయి రూపాయిలవుతుంది. అమ్మ వున్నంత కాలం ఇబ్బంది తెలియలేదు. పోయినేడే పోయింది. ఇంకా రెండేళ్ళ చదువుంది. నాన్న మళ్ళీ పెళ్ళి- పిన్ని మంచిదే. కానీ అవిడ భయం ఆవిడది. నాన్నకింకా పన్నెండేళ్ళ సర్వీసు. తన భవిష్యత్తు గురించి జాగ్రత్తపడుతోంది పిన్ని. నేనూ చెల్లీ దిక్కులేని వాళ్ళమయిపోయాం. నాన్న డబ్బులు పంపడం మానేశాడు. ఉత్తరాలతో జరిగే పనికాదని నిన్న వెళ్ళి కలుసుకొని అడిగాను. ఇహ పంపేది లేదని స్పష్టంగా చెప్పాడు.." అప్పటిదాకా మనసులో గూడుకట్టుకుని వున్న దిగులు వల్ల కాబోలు మాటలు గలగలా దొర్లుతున్నాయి. ఆ చెప్పడంలో ఓ తాత్వికత, కసీ, అసూయా లేనే లేవు.

'అంకుల్..మీరేం చేస్తూ వుంటారు? ఏ ఊరూ?'

'మా స్వగ్రామం పేరు చెప్పాను. ఇండియాలో తిరిగేటప్పుడు 'న్యూయార్క్' అనబుద్ధిగాదు. నా వేషం చూసి అమెరికా వాడినని ఎవరూ అనుకోరు. కూడానూ.

'మరి డబ్బుకింత ఇబ్బంది పడుతున్నవాడివి ఏదైనా పార్ట్‌టైమ్ ఉద్యోగం చేయకూడదా? అమెరికాలో నీ వయసు పిల్లలు తల్లిదండ్రుల మీద ఆధారపడరు తెలుసా?'

'తెలుసు'. బలహీనంగా నవ్వాడు. 'కానీ అంకుల్! ఇది అమెరికా కాదు గదా!. ఇక్కడ డిగ్రీలుంటేనే దిక్కులేదు. అయినా చిన్నా చితకా పనులకు ప్రయత్నించాను. టైము వృధా అయి చదువు దెబ్బతిందే తప్ప అది గొర్రె తోక సంపాదన. లాభం లేకపోయింది. అసలు చదువు మానేద్దామనే వుంది. కానీ మానేసి ఏం చేయాలి?'

ప్రాణం వుసూరుమనిపించింది. విప్లవాలు తేలేమేమో గాని నాలాంటి వాళ్ళం ఇలాంటి కన్నీళ్ళు తుడవలేమూ?

'నీ చదువుకు నేను సాయం చేస్తాను. బెంగ పడక. ఊరికే గాదు. తర్వాత తీరుద్దువు.'

ఆశ్చర్యంగా, అపనమ్మకంగా చూశాడు.

'మానాన్నకు లేని తపన మీకెందుకూ? నేను మీకేం అవుతాను? మీలాంటి అపరిచితుల సాయంతో నేనెంతకాలం నెట్టుకురాగలను? వద్దంకుల్! అలాంటి ఆలోచనలవల్ల లాభం లేదు',

గట్టిగా చెప్పి నా అమెరికా నేపథ్యం వివరించి నమ్మకం కలిగిద్దామనిపించింది. అయినా మనసులో ఏదో అనుమానం. ఇతను చెప్పినదంతా నిజమేనా? అబద్ధాలు చెప్పాల్సిన అవసరం ఏముంది?

తర్జన,భర్జనలు కట్టిపెట్టి నా ఆలోచనకో రూపం ఇచ్చి నా సాయం ఎలా చేయాలా? దానికో స్పష్టమైన ఆకృతి ఇద్దామని నిర్ణయించుకున్నాను. మనసు తేలిక పడింది.

బండి నిడదవోలు, కొవ్వూరు దాటేసింది. గోదావరి రైల్ కమ్ రోడ్ బ్రిడ్జి ఎక్కబోతోంది. దూరాన గోదారి ఉదయపుటెండలో మిలమిలా మెరుస్తోంది. లఘుశంక కోసం టాయిలెట్‌కు వెళ్ళాను. ఓ నిమిషం గడిచిందో లేదో బోగీలో గందరగోళం. బండి నది మధ్యనే మెల్లగా ఆగసాగింది.

'ఆ కుర్రాడు మీ బంధువా సార్?' టాయిలెట్ లోంచి బయటకు రాగానే మా ఇద్దరి పక్కన అప్పటి దాకా కూర్చున్న ఒక పెద్దాయన ఆత్రంగా అడిగాడు. బండి పూర్తిగా ఆగిపోయింది. కొంత మంది బిలబిలా కిందికి దిగారు. దిగి నిండుగా ప్రవహిస్తోన్న గోదావరిలోకి తొంగిచూడసాగారు.

'కాదు. ఏం జరిగింది?' అడిగానా పెద్దాయన్ని.

'దూకేశాడు సార్. దూకేశాడు. గుమ్మం దగ్గరకెడితే గోదావరిని చూడడానికి అనుకున్నాం. దభీమని గెంతేశాడు. అయినా తిన్నగా పడలేదు. ముందు బ్రిడ్జి ఇనుప కమ్మీలకు గుద్దుకున్నాడు. తల పగిలిపోయింది. అక్కణ్ణించి జారి టెలిఫోను వైర్లకి తగులుకున్నాడు. గుడ్డబొమ్మలా కాసేపు ఊగి ఊగి జారి దభాల్న నదిలో పడిపోయాడు. అసలు పడకముందే ప్రాణాలు పోయుంటాయి' చెప్పకొచ్చాడు పెద్దాయన.

భగవాన్. ఎంతలో ఎంత పని జరిగిపోయిందీ!

'పాపం మరీ పసి పిల్లవాడు. ఎందుకా పని చేశాడో?' ఓ ముసలావిడ వాపోయింది.

ఎందుకేమిటీ? భవిష్యత్తు అంధకారంలా కనిపించి. అసలు నేను మా వూరి పేరు కాకుండా న్యూయార్క్ అని వుంటే బతికేవాడేమో! సాయం చేస్తానన్న నమ్మకం కలిగేదేమో! నా అవతారం చూసి ఈ కోన్ కిస్కా పెద్దాయన వాకేం చేస్తాడ్లే అనుకుని వుంటాడు. ఎంత అన్యాయం? ఒక జీవితం.. ఒక నిండు ప్రాణం గోదారిపాలయింది! ఒక్కమాట! ఒక్క నమ్మకం అతని ప్రాణాలు నిలబెట్టి వుండేది. నేనే తీశానా నిండు ప్రాణాన్ని? ఎలా మరచిపోగలనీ సంఘటనను? ఏమిటి దీనికి పరిహారం?

ఆవేదన. దుఃఖం. శూన్యత. వికలమైన మనసు.

ఇహ ఆలోచనలు కట్టిపెట్టి ఆచరణకు దిగాలి. సహజానికి 'ఇవ్వడం' ఈ క్షణమే ఆరంభించాలి. దానికో పటిష్టమైన ప్రణాళిక వేసి మరీ వెళ్ళాలి నేను.

దానికి నాంది ఓ పసివాడి మరణం కావడం- ఎంత విషాదం?

మరుసటి వారవు అమెరికా టికెట్టుకు మరో రెండు, మూడు నెలలు వాయిదా వేయించాలని అప్పటికప్పుడు నిర్ణయించుకున్నాను.

అయినా ఆ కుర్రాడిని మరచిపోగలనా? మామూలు మనిషిని కాగలనా? అసలు అతనే నా ముందు జీవితానికి ప్రేరణ కదా! మరచిపోకూడదేమో!